మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్నారు

- జడ్చర్ల ఎమ్మెల్యే డా.సి. లక్ష్మారెడ్డి
- టిఆర్ఎస్‌లో చేరిన నవాబ్‌పేట కాంగ్రెస్ నాయకులు

**జడ్చర్ల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో సీఎం కెసిఆర్ అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల పట్ల ప్రతిపక్ష నాయకులు సైతం ఆకర్షితులవుతున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే డా.సి. లక్ష్మారెడ్డి అన్నారు. జడ్చర్లలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో నవాబ్‌పేట మండల పరిధిలోని కొండాపూర్ గ్రామ సెగ్మెంట్ కాంగ్రెస్ ఎంపిటిసి సభ్యులు జ్యోతి అంబదాస్, రాంసింగ్ తండా నాయకులు అంబదాస్, డిప్యూటి సర్పంచ్ సురేష్, తండాకు చెందిన పలువురు వార్డు సభ్యులు, 100 మంది యూత్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో మంగళవారం టిఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వారికి టిఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీఎం కెసిఆర్ దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. యువత పనిచేసే ప్రభుత్వం వెంబడి ఉండాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి టిఆర్ఎస్ పార్టీలో చేరికలు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ కోడ్గల్ యాదయ్య, నాయకులు నాగిరెడ్డి, మాడెమోని నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


కొండాపూర్ కాంగ్రెస్ ఎంపిటిసి జ్యోతి అంబదాస్‌ను టిఆర్ఎస్‌లో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే

## ఘనంగా శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం

### అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు

**గద్వాల, ఆగస్టు 23, ప్రభాతవార్త :** శ్రీ జమదాగ్ని సమేత శ్రీశ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు అమ్మవారికి సంప్రదాయం ప్రకారం పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులకు, మున్సిపల్ ఛైర్మన్ దంపతులకు వేదపండితులు సాంప్రదాయంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రావణమాసం చివరి మంగళవారాన్ని పురస్కరించు కుని పచ్చటి పందిరిలో అమ్మవారి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులను ఆలయ ఛైర్మన్, ఈఓ శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నడిగడ్డ ఇలవేల్పు అయిన శ్రీశ్రీ జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం గత సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. భవిష్యత్తులో జమ్ములమ్మ అమ్మవారి పుణ్యక్షేత్రంగా ఏర్పడే విధంగా ప్రభుత్వం తరపున కృషి చేస్తామని తెలిపారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రత్యేకంగా రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా అష్టం 18 పీఠాలతో నిర్మాణం కాబోతున్నాయి. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం, నడిగడ్డ ప్రాంతం రైతులకు సకాలంలో వర్షాలు పడాలని, రైతు అభివృద్ధి చెందాలని, కెసిఆర్ కలలుగన్న రైతు రాజు త్వరగానే నెరవేరాలని, అదేవిధంగా ప్రజలందరు సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకోవడం జరిగిందన్నారు. దేవాలయ అభివృద్ధికి నావంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ సరోజమ్మ, వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ రామేశ్వరమ్మ, ఎంపిపిలు విజయ్, రాజారెడ్డి, మనోరమ, జడ్పీటిసిలు, వైస్ ఎంపిపి రామకృష్ణనాయుడు, ఆలయ కమిటి ఛైర్మన్ సతీష్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తెరాస పార్టీ నాయకులు, కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దంపతులు, అమ్మవారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి

**జములమ్మ అమ్మవారిని దర్శించుకున్న కలెక్టర్..**

జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రసిద్ది చెందిన శ్రీ జమ్ములమ్మ దేవాలయాన్ని సందర్శించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. మంగళవారం శ్రీ జమ్ములమ్మ దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించగా దేవాలయ ఛైర్మన్ సతీష్, ఆలయ అర్చకులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ జమదగ్ని సమేత శ్రీ జమ్ములమ్మ అమ్మవారి కళ్యాణానికి విచ్చేస్తున్న భక్తులకు తాగునీరు, వైద్య సదుపాయం ఇతర సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. దేవాలయ పరిసరాలలో ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా చూడాలని ఒకవేళ ఉన్న దుకాణదారులకు జరిమానా విధించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రోడ్లపై మద్యం సేవించకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. దేవాలయ పరిసరాల దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించకుండా యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి తెలపాలని, మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో షాపులన్నింటిని చెక్‌చేసి జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సతీష్, మున్సిపల్ కమిషనర్ జానకిరామ్‌సాగర్, ఈఓ కవిత, ఎక్సైజ్ అధికారులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చెంచుల సాధికారతపై సమీక్ష

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** నల్లమల ఆదివాసి చెంచుల ఆర్థిక, సామాజిక సాధికారతకు వివిధ జిల్లాల సహాయ ప్రాజెక్టు అధికారులు ఐటిడిఎలు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ సూచించారు. మంగళవారం వివిధ జిల్లాల ఎపిఓలు, పిఓ ఐటిడిఎలతో చెంచుల సాధికారతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆదివాసీ చెంచుల సాధికారతకు ఇప్పటికే 102 గృహాలు, ఆర్థిక సాధికారతకు 10 శాతం వ్యక్తిగత పెట్టుబడిపై వ్యాపార యూనిట్లు నెలకొల్పేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. 2019 లో మంజూరైన ఇళ్లు దాదాపు పూర్తికావస్తున్నాయని వీటితో పాటు ఆర్థిక సాధికారతకు చేపలు పట్టి అమ్ముకునే యూనిట్లు, తేనె ప్రాసెసింగ్ యూనిట్లు, సన్నారి, గిరిరాజ కోళ్ల పెంపకం, చీపురు తయారీ వంటి యూనిట్లు నెలకొల్పడానికి ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి లబ్దిదారులను ఎంపిక చేసి భాగస్వాములను చేసినట్లు తెలిపారు. వీటితో పాటు సేంద్రీయ వ్యవసాయం చేయించడానికి నిధులు మంజూరై ఉన్నాయని, చెంచులకు అవగాహన కల్పించి సేంద్రీయ వ్యవసాయం వైపు ప్రోత్సహించడానికి అనుభవజ్ఞులైన వ్యవసాయ విస్తీర్ణాధికారులు, వ్యవసాయ అధికారుల అవసరం ఉందన్నారు. ఇతర జిల్లాల్లోని చెంచు పెంటల్లో పని చేస్తూ అనుభవజ్ఞులైన వ్యవసాయ అధికారులను ఆయా జిల్లా కలెక్టర్లతో మాట్లాడి పిలిపించే ప్రయత్నం చేయనున్నట్లు తెలిపారు. ఆరోగ్యం, విద్యా పరంగా చెంచులకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చెంచులకు పూర్తి వైద్య పరీక్షలు చేయించడం, అవసరమైన వైద్యం అందించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా చెంచు పెంటల్లో ఇస్తున్న మౌలిక సదుపాయాలు, అక్కడి అనుభవాలను అడిగిత తెలుసుకున్నారు. చెంచులకు ఇంకా ఏ రకమైన సేవలు, లైవ్లీహుడ్ అందించవచ్చునో చర్చించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ సంచాలకులు బి. పుష్ప, డిటిడిఓలు చత్రు, కోటాజీ, అనిల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## సీఎం సహాయ నిధి పేదల పాలిట వరం

- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ

**కల్వకుర్తి, ఆగస్టు 23, ప్రభాతవార్త:** పేద ప్రజలు అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం అధు నాతనమైన వసతుల తో కూడిన కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు ముఖ్య మంత్రి సహాయనిధి పేద ప్రజల పాలిట వరమని మహబూ బ్‌నగర్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలంలోని పార్వతమ్మకు మంజూరైన రూ.43వేలు, డీ.కాంతమ్మకు రూ.16వేలు, జే.సురేష్‌గౌడ్‌కు రూ.16వేలు, వి.మహేష్‌కు మంజూరైన రూ.12వేలు, ఆమనగల్లు మండలంలోని రాజుకు మంజూరైన రూ.16వేలు, వినోద్‌కు మంజూరైన రూ.20వేలు, జహంగీర్‌బీకి మంజూరైన రూ.16వేలు, అనితకు మంజూరైన రూ.21వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరప్రధాయినిగా నిలుస్తోందన్నారు. ప్రమాదాల్లో గాయపడ్డవారు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందారని, నిరుపేదలు ఎంతో ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ప్రాణాలతో జీవిస్తున్నారని ఆయన తెలిపారు. కడ్తాల్ మండలం ఆంధ్రభూమి రిపోర్టర్ కృష్ణయ్యను మందా జగన్నాథ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యాక్రమంలో ఆయా మండలాల నాయకులు తదితరులు ఉన్నారు.

## పరిశుభ్రతతోనే ఇన్ఫెక్షన్ నివారణ - డాక్టర్ విజయ్ ఎల్దండి

**మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** పరిశుభ్రతపై అత్యంత శ్రద్ధ చూపాలని, పరిశుభ్రత పాటించడం వల్ల రోగులకు ఇన్ఫెక్షన్ రాకుండా నివారించ వచ్చుని డిప్లొమేట్ ద అమెరికన్ బోర్డ్ ఆఫ్ ఇంటర్నల్ మెడిసిన్ డాక్టర్ విజయ్ ఎల్దండి అన్నారు. మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన ఇంటర్నల్ డిసీసెస్‌పై నిర్వహించచన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 5 ఎస్ అనే సూత్రం పాటించాలని, పరిశుభ్రమైన చేతుల ద్వారా 80 శాతం ఇన్ఫెక్షన్‌లు రాకుండా చూడగలమన్నారు. బయోమెడికల్ వ్యర్థాలు డస్ట్‌బిన్‌లో 4వ వంతు నిండకముందే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎక్కువ ఇన్ఫెక్షన్ ఉన్న ప్రాంతాలను శుభ్రపరచడానికి వాడిన పరికరాలను తక్కువ ఇన్ఫెక్షన్ ఉన్న ఏరియాలో ఉపయోగించవద్దన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రాంకిషన్, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ జీవన్, డాక్టర్ సిరాజుద్దీన్, వంశీకృష్ణ, వకుల్లా, ప్రసన్న, కార్తిక్, నవలకిషోర్, జయశ్రీ, తులసీరాం, నజ్మా, అలేఖ్య, తేజస్విని పాల్గొన్నారు.


వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్ ఎల్దండి

## దళితుల అభివృద్ధి కోసమే దళితబంధు పథకం


దళితబంధు కింద మంజూరైన ట్రాక్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

**గద్వాల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల మండల పరిధిలోని జిల్లెడ బండ గ్రామానికి చెందిన వెంకటరాములుకు దళిత బంధు ద్వారా ఎంపికైన రూ. 10 లక్షల వ్యయంతో ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి లబ్దిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను లబ్దిదారులు శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలో ఏ ముఖ్యమంత్రికి రాని ఆలోచన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కెసిఆర్‌కు రావడం జరిగిందని, దళితులు కూడా ఆర్థికంగా ఎదగాలని దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టి నలుగురికి ఉపాధి కల్పించే విధంగా ఉండాలని ఈ పథకం ప్రవేశపెట్టారన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ రామేశ్వరమ్మ, ఎంపిపి విజయ్, వైస్ ఎంపిపి రామకృష్ణనాయుడు, గద్వాల టౌన్ పార్టీ అధ్యక్షుడు గోవిందు, కెటిదొడ్డి మండల పార్టీ అధ్యక్షుడు ఉరుకుందు, ట్రాక్టర్ షోరూమ్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, తెరాస పార్టీ నాయకులు నరసింహారెడ్డి, కురుమన్న, ధర్మనాయుడు, రామకృష్ణానాయుడు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే ఏకైక లక్ష్యం..

### ఈదమ్మ బోనాలకు హాజరైన ఎంపీ రాములు

**వంగూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:** పల్లెలను అభివృద్ధి పరిచి ప్రజల సమస్యలను తీర్చడమే ఏకైక లక్ష్యమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు అన్నారు. మంగళవారం వంగూరు మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో నిర్వహించిన ఈదమ్మ బోనాలకు హాజరయ్యారు. గ్రామస్తుల కోరిక మేరకు దేవాలయ నిర్మాణానికి రూ.5లక్షలు, గ్రామంలోని సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలను మంజూరు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అనంతరం మన ఊరు - మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చేపడుతున్న పనులు నాణ్యవంతంగా నిర్మించాలని ఆయన సూచించారు. అదే విధంగా ప్రజలకు ఎలాంటిసమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి అధికారులను, గ్రామస్తులను అభినందించారు. అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో గ్రామాభివృద్ధికి తోడ్పాటువేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం పల్లెలను అభివృద్ధి పర్చేందుకు ఎన్నో సంక్షేమ ఫలాలను ప్రవేశ పెట్టిందని, ప్రతి ఒక్కరికి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించి వారి అభివృద్ధికి దోహద పడాలన్నారు. కార్యక్రమంలో కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు అంకు సురేందర్, నాయకులు విజయపాల్‌రెడ్డి, రేణుగౌడ్, పంచాయతీ కార్యదర్శి కిషన్, మిసాల జంగయ్య, సాయన్న, లింగారెడ్డి, గోపాల్‌రెడ్డి, సత్యంగౌడ్, వెంకటయ్య, మల్లేష్, రేణు, రామస్వామి, వెంకటయ్య, పర్వతాలు, నాగయ్య, శ్రీను, రాంలక్ష్మయ్య తదితరులు ఉన్నారు.


గ్రామంలో చేపడుతున్న పనులను పరిశీలిస్తున్న ఎంపీ రాములు


బోనాల వేడుకల్లో ఎంపీ రాములు

## పెబ్బేరులో పట్టుబడ్డ కల్తీ మద్యం

- రఘువైన్స్‌పై కేసు నమోదు

**పెబ్బేరు, ఆగస్టు 23 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం రఘు వైన్స్‌లో కల్తీ మద్యం విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో సోమవారం రాత్రి స్టేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసు బలగాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రఘు వైన్స్‌లో కల్తీ మద్యాన్ని గుర్తించినట్లు కొత్తకోట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఓంకార్‌గౌడ్ తెలిపారు. 45వ జాతీయ రహదారిపై గల పెబ్బేరులో ఐదు మద్యం దుకాణాలు ఉన్నాయి. ఎప్పుడు జనసంద్రంతో కిక్కిరిసే వైన్ షాపుల వద్ద కల్తీ మద్యం ఏరులై పారుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కల్తీ మద్యాన్ని జోరుగా కొనసాగిస్తూ పెద్ద మనుషుల్లాగా చలామణి అవుతున్నారు. దొరికితే దొంగ దొరక్కుంటే దొరల సామెతను నిజం చేస్తున్నారు. కల్తీ మద్యంతో సామాన్యుల ఆరోగ్యాన్ని దెబ్బతీసు_ ్తండడం గమనార్హం.

**-175 బాటిళ్లు స్వాధీనం...**

స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు చిరంజీవి బృందం తనిఖీలు నిర్వహించారు. పెబ్బేరు పురపాలక పరిధిలోని రఘు వైన్స్‌ను తనిఖీ చేయగా ఆఫీసర్ ఛాయిస్ -33 ఫుల్ బాటిళ్లు ఇంపీరియల్ బ్లూ విస్కీ, ఆఫ్ బాటిళ్లు -78, క్వాటర్ బాటిళ్లు -61 మద్యం సీసాల మూతలను తీసి ఇన్ వాటిలో నుంచి కొద్ది మోతాదులో మద్యంను తీసినట్లు ఎక్సైజ్ అధికారులు ధృవీకరించారు. వాటి స్థానంలో నీటిని కలిపి మూతలను బిగించి అమ్మకం చేస్తున్నట్లు గుర్తించారు. మొత్తం సీసాలతో పాటు కేసు పత్రాలు స్వాధీనం చేసుకుని కొత్తకోట ఎక్సైజ్ స్టేషన్‌లో డిపాజిట్ చేశారు. రఘు వైన్స్ నిర్వాహకులు బి. ఎల్లస్వామి, గుమస్తా శివకుమార్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొత్తకోట ఎక్సైజ్ సిఐ ఓంకార్ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.


వైన్ షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు



రఘువైన్స్ షాపు

## బండి సంజయ్ అక్రమ అరెస్టుకు బిజెపి నాయకుల నిరసన

### భూత్పూర్-చౌరస్తాలో తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

**భూత్పూర్, ఆగస్టు23, ప్రభాతవార్త :** ఎంపి కల్వకుంట్ల కవిత ఇంటిముందు శాంతియుతంగా నిరసన తెల్పుతున్న తమ పార్టీ నాయకుల అరెస్ట్ అక్రమమని పేర్కొంటూ బీజేపి నాయకులు, కార్యకర్తలు మంగళవారం సాయంత్రం భూత్పూర్ జాతీయ రహదారి-44 కూడలిలో ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు డౌన్.. డౌన్.. అంటూ నినాదాలు చేస్తూ నిరసనలు తెలిపారు. తమ రాష్ట్ర పార్టీ అధ్యక్షుని హౌస్ అరెస్ట్ చేయడం సబబైన చర్యకాదని ధర్నాలో పాల్గొన్న పార్టీ కిషాన్‌మోర్చా రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. బండి సంజయ్‌ని బేషరతుగా వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను వారు దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంగాపురం రవీందర్, పట్నంకౌన్సిలర్ ఫరూఖ్‌హుస్సేన్, శ్రీశైలం, మేకల మల్లేష్, హరినాథ్‌గౌడ్, సురేందర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


భూత్పూర్ చౌరస్తాలో తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీజేపీ నాయకులు

## లెఫ్ట్ కెనాల్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి


లెఫ్ట్ కెనాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి

**గోపాల్‌పేట, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మహాత్మాగాంధి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద లెఫ్ట్‌కెనాల్ సేజీ -5 కింద చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని కా ంట్రాక్టర్లకు, అధికారులకు మంత్రి నిరంజన్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఏదుల, అనంతాపూర్ గ్రామాలలో పర్యటించి కెనాల్ పనులను రెండు నెలల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, రేవల్లి జడ్పీటిసి భీమయ్య, నాయకులు నరేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## యువకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

**వెల్దండ, ఆగస్టు 23, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని నగరగడ్డ తాండ గ్రామ సర్పంచ్ దశరథ్‌నాయక్ కుమారుడు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మంగళవారం ఆసుపత్రికి చేరుకొని బాధితుడిని పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.


ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

## 130వ రోజు నడిగడ్డలో షర్మిల ప్రజా ప్రస్థాన యాత్ర

**ధరూర్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** ధరూర్ మండల పరిధిలో వైఎస్ షర్మిల పాదయాత్ర మంగళవారం ఎమ్మినోముపల్లి స్టేజీ నుండి ప్రారంభమైంది. రోడ్డు మార్గాన పాదయాత్ర చేస్తూ రోడ్డు వెంట పంటపొలాల్లో ఉన్న రైతులను వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ వ్యవస్థాపకురాలు వైఎస్ షర్మిల ఆత్మీయంగా పలకరించారు. ధరూర్ మండల పరిధిలోని భీంపుర్, చిన్నపాడు, పెద్దపాడు, ఈడిగోనిపల్లి, శెట్టి ఆత్మకూర్ మీదుగా గద్వాల జిల్లా కేంద్రానికి పాదయాత్ర చేరింది. గ్రామంలో ప్రజలతో మమేకమై మాట ముచ్చట నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. పాదయాత్రలో సీఎం కెసిఆర్ పథకాలపై విమర్శలు గుప్పించారు. వైఎస్ షర్మిల కెసిఆర్ పథకాల పేరుతో ప్రతి వర్గాన్ని మోసం చేశారని విరుచుకుపడ్డారు. వైఎస్ఆర్ ప్రతి పథకాన్ని అద్భుతంగా అమలు చేస్తే, సీఎం కెసిఆర్ వాటిని పక్కన పెట్టాడని వైఎస్ షర్మిల ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టివైఎస్ఆర్ పార్టీ సీనియర్ నాయకుడు అతికూర్ రెహమాన్, పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కొనసాగుతున్న వైఎస్ షర్మిల పాదయాత్ర

## హైమాస్ట్ లైట్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

**అడ్డాకుల, ఆగస్టు 23, ప్రభాతవార్త:** మండల పరిదిలోని కందూరు అనుబంధ గ్రామమైన గౌరిదేవిపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి హైమాస్ట్ లైట్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కందూరు సర్పంచు శ్రీకాంత్, ఎంపిటిసిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన అభిమన్యురెడ్డి

**రాజాపూర్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలంలోని అగ్రహారం పొట్లపల్లి గ్రామంలో ఎర్రోళ్ల కిష్టయ్య (60) అకస్మాత్తుగా మరణించారు. వారి మృతికి సంతాపం తెలిపిన టిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యురెడ్డి అంత్యక్రియల ఖర్చుల కోసం బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని యువసేన సభ్యుల ద్వారా అందజేశారు. సర్పంచ్ సాయమ్మ, మాజీ సర్పంచ్ శ్రీరాములు, గ్రామ టిఆర్ఎస్ ప్రెసిడెంట్ భరత్‌రెడ్డి, శ్రీరాములు, ఎర్రోళ్ల శ్రీను, శ్రీను, శివప్రసాద్, ఆంజనేయులు, చంద్రకాంత్‌రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ సురెందర్, నవీన్, సంపత్, ఇస్తారి గ్రామస్తులు, టిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



ఆర్థిక సహాయం చేస్తున్న దృశ్యం

## బిజెపి నేతల బలవంతపు అరెస్టులు

**రేవల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మండల బిజెపి పార్టీ శాఖ నిరసన దీక్ష కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు అజయ్‌గౌడ్, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు ఎక్కె జంబులయ్య యాదవ్‌లు, కార్యకర్తలు మంగళవారం మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద తమ పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ అక్రమ అరెస్టుకు నిరసనగా తెలుపుతుండగా మండల ఎస్సై మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి బలవంతంగా పోలీస్ వాహనంలో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ కూడా నిరసన దీక్ష కొనసాగించి పోలీసుల దౌర్జన్యం నశించాలని, ఈ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వం పారదోలాలని నినాదాలు చేశారు.



బిజెపి నాయకులను అరెస్టు చేస్తున్న దృశ్యం

## దివ్యాంగ విద్యార్థులకు ఆరోగ్య కిట్ల పంపిణీ



ఆరోగ్య కిట్లు అందజేస్తున్న దృశ్యం

**ఉట్కూర్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని నిడుగుర్తి గ్రామ అంగన్‌వాడి కేంద్రంలో వికలాంగ విద్యార్థులకు ఆరోగ్య పెంపుదలకు ఉపయో గపడేలా పోషక ఆహా రంతో కూడిన వివిధ పదార్థాలతో కూడిన ఆరోగ్య కిట్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ యశోదమ్మ, ఎంపిటిసి రాఘవరెడ్డి హాజరై ప్రభుత్వం కల్పించిన ఈ ఆరోగ్ య కిట్లను సక్రమంగా ఉపయోగించుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని, ఇటువంటి గొప్ప పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు అన్నారు. సూపర్ వైజర్ సరోజ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు సరైన పోషకాహారం లేక ఇబ్బందులు పడుతున్నారని అటువంటి పరిస్థితి పిల్లలకు రాకూడదనే ఉద్దేశంతో సంపూర్ణ పోషకాహారం కలిగిన అన్ని రకాల ఆహార పదర్థాలు అందించబడుతుందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యశోదమ్మ, ఎంపిటిసి రాఘవరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, అంగన్‌వాడి సూపర్‌వైజర్ సరోజ, టీచర్ జ్యోతిలక్ష్మి, ఎఎన్ఎం మంజుల, ఆయాలు మల్లమ్మ, కిష్టమ్మ పాల్గొన్నారు.

## పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎల్లేని



ఎల్లేని సుధాకర్‌రావును సన్మానిస్తున్న ఆలయ కమిటి సభ్యులు

**పెంట్లవెల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** పెంట్లవెల్లి మండల కేంద్రంలో మంగళవారం పోచమ్మ బోనాల సందర్భంగా పోచమ్మ అమ్మవారి ఆలయం పునర్నిర్మా ణాన్ని ముగించుకుని, ఆలయ కమిటి వారి ఆహ్వానం మేరకు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్ర మానికి ముఖ్య అతిథి గా హాజరైన నాగర్‌క ర్నూల్ జిల్లా బిజెపి అధ్యక్షులు, కొల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి ఎల్లేని సుధాకర్‌రావును ఆలయ కమిటి సభ్యులు శాలువాతో సత్కరించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రావు మాట్లాడుతూ ప్రజలందరు అమ్మవారి కృపతో, పాడిపంటలతో, సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో ఎదగాలని పోచమ్మ తల్లి అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎల్లేనితో పాటు పెంట్లవెల్లి మండల అధ్యక్షులు పొద్దుటూరి ప్రసాద్, జిల్లా, మండల బిజెపి, బిజెవైఎం నాయకులు పాల్గొన్నారు.

## సాహితీ మాణిక్యం పురస్కారానికి కవి వనపట్ల సుబ్బయ్య ఎంపిక

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** సాహితీ మాణిక్యం పురస్కారానికి కవి వనపట్ల సుబ్బయ్య ఎంపిక కావడం పట్ల నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి పి. వహీద్‌ఖాన్, గౌరవ అధ్యక్షులుగా కందికొండ మోహన్, వెన్నెల సాహిత్య అకాడమి అధ్యక్షులు ముచ్చర్ల దినకర్, ప్రముఖ కవులు కల్వకోల్ మద్దిలేటి, వెంకట్ పవార్, నీరటి బాలీశ్వర్, ఎదిరపల్లి కాశన్నలు హర్షం వ్యక్తం చేశారు. సాహితీ మాణిక్యం పురస్కార్ రావడం నాగర్‌కర్నూల్ ప్రాంతానికెంతో గర్వకారణమని అన్నారు. రావులపాటి నారాయణ –మాణిక్యం స్మారక పురస్కారం కమిటి ఖమ్మం వారు ప్రతి సంవత్సరం ప్రధానం చేసే సాహితీ మాణిక్యం పురస్కారానికి 2021 సంవత్సరం పురస్కారానికి వనపట్ల సుబ్బయ్యను ఎంపిక చేసినట్లు పురస్కారాల కమిటి ఖమ్మం వెల్లడించింది. ఈ పురస్కారాన్ని 28 ఆదివారం సాయంత్రం 6 గం.లకు హైదరాబాద్ బాగ్ లింగంపల్లి దొడ్డి కొమురయ్య హాల్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వ్యవసాయశాఖ మాత్యులు పువ్వాడ అజయ్‌కుమార్, రవాణా శాఖ మాత్యులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



వనపట్ల సుబ్బయ్య

## కళాకారులకు డప్పుల పంపిణీ

**బిజినేపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్తః** మండల పరిధిలోని పాలెం గ్రామంలో డప్పు కళాకారులకు సర్పంచ్ గోవిందు లావణ్య నాగరాజ్ మంగళవారం నూతన డప్పులను కళాకారులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ పోచమ్మ, కర్రెమ్మ భోనాలకు గాను డప్పు వాయిద్యా కళాకారులకు నూతన డప్పులను ఇవ్వడం జరిగిందని తెలిపారు, కళాకారులకు ఈ డప్పులు ఆర్థికంగా పని కల్పించే విదంగా ఉంటాయని ఆశిస్తున్నామని తెలిపారు. నూతన డప్పులను పంపిణి చేసిన సర్పంచ్ ధంపతులకు కళాకారులు,ధన్యవాదాలు తెలిపారు,పాలెం గ్రామ ప్రజలకు కాళాకారుల తరుపున,సర్పంచ్ తరుపున భోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు, ఈ కార్యక్రమంలో కళాకారులు కాశన్న, రామకృష్ణ, కర్రెన్న, బుచ్చన్న, లక్ష్మయ్య, కాశన్న తదితరులు పాల్గొన్నారు,



కళాకారులకు డప్పులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ లావణ్యనాగరాజ్

## ఘనంగా పోచమ్మ బోనాల వేడుకలు

### - కౌకుంట్ల, డోకూర్, ఇస్రంపల్లి గ్రామాలలో అమ్మవారి వేడుకలు







డోకూర్‌లో పూజలు చేస్తున్న గ్రామస్థులు, అలంకరణలో అమ్మవారు, కౌకుంట్లలో బోనంకుండతో వస్తున్న సర్పంచ్ స్వప్నకిషన్‌రావు

**దేవరకద్ర రూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలోని ఆయా గ్రామాలలో మంగళవారం గ్రామదేవత పోచమ్మబోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కౌకుంట్ల, డోకూర్, ఇస్రంపల్లి గ్రామాలలో ఈ పండుగను జరుపుకొన్నారు. దీంతో ఆయా గ్రామాలు భక్తిపారవశ్యంతో పులకించిపోయాయి. ప్రతి ఏడాది ఆయా గ్రామాలలో పోచమ్మ బోనాల పండుగను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ పోచమ్మ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాలలో బోనాల ఊరేగింపులను భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయరీతిలో నిర్వహించారు. పెద్ద బోనం కుండ ముందు వెళ్తుండగా, బ్యాండు, డోలు వాయిధ్యాల, శివసత్తుల పూనకాల మద్య ఈ బోనాల ఊరేగింపు మందుకు కదిలింది. బోనం కుండలను సర్వాంగ సుందరంగ అలంకరించుకొని తలపై పెట్టుకొని మహిళలు,యువతులు ఈ బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం పోచమ్మ గుడి చుట్టూ బోనం కుండలతో మహిళలు పెద్ద ఎత్తున ప్రదక్షణలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక నైవేధ్యాలు సమర్పించారు. వేడుకల సందర్భంగా పోచమ్మ అమ్మవారి మూల విగ్రహాలను రకరకాల పూలు, ఆభరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అలాగే గ్రామంలోని బొడ్రాయిలను కూడ వేపాకులతో అలంకిరించి పూజలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా గ్రామానికి చెందిన ఆడపడుచులంతా రావడంతో వారితో ప్రతి ఇల్లు కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ప్రజలు,ప్రజాప్రతినిధులు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## లిక్కర్ కుంభకోణంపై భగ్గుమన్న బిజెపి నాయకులు

### - సీఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం

**జడ్చర్ల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక అంబేద్కర్ కూడలిలో తెలంగాణ ముఖ్యమ ంత్రి కె. చంద్రశేఖర్‌రావు దిష్టిబొమ్మను స్థానిక బిజెపి నాయకులు దహనం చేశారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం వ్యవహారంలో తెరాస ఎమ్మెల్సీ కవిత ప్రమేయం ఉందని ఆరోపిస్తూ వారు భగ్గుమన్నారు. ఈ నేపథ్యంలో కవిత ఇంటిముందు శాంతియుత నిరసన తెలుపుతున్న బిజెపి కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రమేష్‌జీ, టౌన్ అధ్యక్షుడు సామల నాగరాజులు మాట్లాడుతూ ఢిల్లీలో లిక్కర్ కుంభకోణంలో, తెరాస ఎమ్మెల్సీ ప్రమేయం ఉందని ఆరోపిస్తూ ఎమ్మెల్సీ కవిత రాజీనామా చేయాలని హైదరాబాద్‌లోని కవిత ఇంటి వద్ద భారతీయ జనతా పార్టీ నాయకులు శాంతియుతంగా నిరసన తెలిపారని, ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులపై పోలీసులు, తెరాస గుండాలు దాడి చేయడం పిరికిపంద చర్యని అన్నారు. వెంటనే కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ 3వ సారి ప్రజాసంగ్రామ యాత్ర చేస్తుంటే పోలీసులు అడ్డుకోవడం శోచనీయమన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం యాత్రను భగ్నం చేసే విధంగా ప్రయత్నం చేస్తుందని, ఎన్ని ఆటంకాలు సృష్టించినా ప్రజాసంగ్రామ యాత్ర నడుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఓబిసి జిల్లా అధికార ప్రతినిధి మధు, వెంకట్, బాబు, శ్రీనివాస్‌గౌడ్, మల్లేష్, గోపాల్, బుక్క నవీన్, మరికంటి సురెందర్, శ్రీనాథ్, మల్లేష్, బాలస్వామి, విష్ణు, కన్నా,పవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బిజెపి నాయకులు

## విద్యార్థులకు బహుమతులను అందజేసిన మాజీ యంపీటీసీ

**దేవరకద్ర రూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** దేవరకద్రకు చెందిన మాజీ యంపీటీసీ, సామాజికవేత్త, ఎస్ఆర్‌నగర్ కాలని అధ్యక్షుడు ఉస్కిళ్ళ వెంకట్రాములు తన సొంత ఖర్చులతో విధ్యార్థులకు మంగళవారం బహుమతులను అందజేశారు. మహబూబ్ నగర్‌లోని మహాత్మా గాంధీరోడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, క్రిస్టియన్‌పల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలలో విద్యార్థులకు స్వతంత్ర్య వజ్రోత్స వాల సందర్భంగా పలు పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు దాదాపు రూ.12వేల విలువ గల బహుమతులను ఉస్కిళ్ళ వెంకట్రాములు తన సొంత ఖర్చులతో వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూపాంగ్ జాన్‌సుందర్. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల మైనార్టీ పాఠశాలల మరియు కాలేజీల రీజినల్ కోఆర్డినేటర్ జమీల్, ఆయా పాఠశాలల ప్రాధానోపాధ్యాయులు పాష, వేణుగోపాల్, ఉపాధ్యాయులు మల్లయ్య, కథలయ్యలతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజస్థాన్ రాష్ట్రంలో తొమ్మిది సంవత్సరాల దళిత విద్యార్థి పై ఓ ఉపాధ్యాయుడు చితకబాదడాన్ని ఉస్కిళ్ళ వెంకట్రాములు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో జరిగే విధ్య వ్యవస్థను కులమనే అహంకారంతో కాకుండా అందరూ సమానులే అనే రాజ్యాంగం ఇచ్చిన హక్కు మేరకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. విద్యార్థిని కొట్టిన సదరు ఉపాధ్యాయుడిపై వెంటనే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు.



విధ్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఉస్కిళ్ళ వెంకట్రాములు

---

## దళితుల పట్ల వివక్ష తగదు

### - కుల వివక్ష నిర్మూలన కోసం పాటుపడాలి
### - విద్యా సంస్థల బందులో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బంగారయ్య

**లింగాల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా దేశంలో ఇంకా దళితుల పట్ల వివక్షత చూపడం తగదని, కుల వివక్షత నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షులు బంగారయ్య అన్నారు. ఎమ్మార్పీఎస్ పిలుపు మేరకు విద్యా సంస్థల స్వచ్ఛంద బంద్ బుధవారం అంబటిపల్లి, లింగాలలో పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలో జోలార్ జిల్లాలో సురానా గ్రామంలో ఒక పాఠశాలలో మూడవ తరగతి చదువుకుంటున్న తొమ్మిదేళ్ల దళిత విద్యార్థి ఇంద్రకుమార్ మెగ్వాల్ అందరు విద్యార్థులు తాగే మంచినీళ్ల కుండలో నీళ్లు తాగాడనే నెపంతో ఆ పాఠశాల టీచర్ చైల్‌సింగ్ అమానుషంగా అత్యంత కిరాతకంగా కొట్టి దారుణంగా హింసించడంతో ఆసుపత్రిలో 24 రోజులపాటు చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడి ఈనెల 14న మరణించడం మానవత్వం ఉన్న ప్రతి మనిషి హృదయాన్ని కలచి వేసిందన్నారు. దేశంలో కుల వ్యవస్థ, అంటరానితనం ఇప్పటికి దళిత ప్రజలకు ఎంతటి హింస పెడుతున్నదో గుర్తించాలన్నారు. ఈసంఘటనపై దేశ ప్రధాని నరేంద్రమోడీ కనీసం సానుభూతి లేకపోతే, కులోన్మాదులకు హెచ్చరిక చేయకపోతే దళితుల మీద అకృత్యాలు ఎలా ఆగుతాయని ప్రశ్నించారు. దేశంలో కుల వివక్ష రూపుమాపాలని, ఇప్పటికైనా దళితుల మీద దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని, ఇంద్రకుమార్ మేగ్వాల్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఈనెల 15 నుండి 22 వరకు వివిధ రూపాలలో నిరసన తెలపడంతో పాటు నేడు విద్యా సంస్థల స్వచ్ఛంద బంద్ చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మహేష్ నాయక్, భూపాల్‌రాజ్, శ్రవణ్, అశోక్, రమేష్, శివ, రాజు పాల్గొన్నారు.



అంబటిపల్లి హైస్కూల్‌లో వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## డబుల్‌బెడ్‌రూం ఇండ్లు పంపిణీ చేయాలని సీపీఐ రిలే దీక్షలు

**కల్వకుర్తి, ఆగస్టు 23, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రిలే దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు హాజరై మాట్లాడుతూ... అర్హులైన పేదలందరికి డబుల్ రూం ఇండ్లు పంపిణీ చేయాలని, ఇంటి స్థలం ఉంటే నిర్మాణానికి నాలుగు సంవత్సరాల క్రితం రూ.5లక్షలు ఇస్తామని, ప్రస్తుతం రూ.3లక్షలు ఇస్తామని చెప్పడం హేయమైన చర్య అని, సిమెంట్, ఇటుక, స్టీలు అన్ని ధరలు రెట్టింపు అయితే ప్రస్తుతం సీఎం కేసీఆర్ చెప్పిన దాంట్లో సగం ఇస్తామనడం సిగ్గుచేటుకరమన్నారు.డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ప్రభుత్వ ఆర్థిక సహాయం అందని పేదలకు 100 గజాల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలో సీపీఎం నాయకులు బాలస్వామి, జగన్, మంతయ్య, కడారి ఆంజనేయులు, భీముడు, మల్లయ్య, బాల్‌రెడ్డి, శ్రీనివాసులు, వర్గం పర్వతాలు, కేశవులు, యాదయ్య, ఆంజనేయులు, వెంకటయ్య, బ్రహ్మం, మల్లయ్య, సాయిబాబు, యాదగిరి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు

---

## మండలంలో 120 ఎకరాలు ప్రభుత్వ భూములుగా నమోదు

**ఇటిక్యాల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మండలంలో గత ప్రభుత్వాలు వివిధ దశల్లో పేద ప్రజల కొరకు ఇళ్ల స్థలాల పంపిణీకి పట్టా భూములు సేకరించడం జరిగింది. అయితే ఆ భూమిలో ఇప్పటివరకు సంబంధిత రైతుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో నమోద య్యాయని ఇటిక్యాల తహసిల్దార్ సుబ్రమణ్యం భూసేకరణ అధికారుల నుంచి సమాచారం అందుకుని రైతులకు ఇచ్చిన నష్టపరిహారం అవార్డు కాపీల నివేదిక వివరాలు తీసుకుని రెవెన్యూ రికార్డులను పరిశీలించి మండలంలో దాదాపు 120 ఎకరాలకు పైగా భూమిని గుర్తించడం జరిగిందని అదేవిధంగా భూమి సంబంధిత శాఖల ఇరిగేషన్, బలహీన వర్గాల ఇండ్లుగా నమోదు చేసేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించగా జిల్లా కలెక్టర్ అట్టి భూములను సంబంధిత శాఖల పేరుమీద మార్పు చేసినట్లు తహసిల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. అలాంటి రైతుల వివరాలను గ్రామాల వారిగా సేకరించి అవార్డు కాపీల వారిగా రెవెన్యూ రికార్డుల్లో బలహీన వర్గాల ఇళ్ల స్థలాలు, ఇరిగేషన్ శాఖలపై నమోదు చేసి, భూములను సంబంధిత శాఖల పేరుపై రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు పై భూములకు సంబంధించిన రైతులు వారి పేర్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు కావడంతో రైతుబంధు పథకం కూడా పొంది ఉన్నారు. ఇకనుండి అలాంటి రైతులు రైతుబంధు పథకం పొందే అవకాశం లేదు.

## కల్వకుంట్ల కవిత ఇంటిపై బిజెపి పార్టీ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

### - తెరాస నాయకులు గవినోళ్ల శ్రీనివాస్

**దామరగిద్ద, ఆగస్టు 23 ప్రభాతవార్త :** బిజెపి నాయకులు అక్రమంగా తెరాస నాయకురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇంటిపై అక్రమంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గవినోళ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి నాయకులు అనవసరంగా ముఖ్యమంత్రి కెసిఆర్ కుటుంబాన్ని బద్నామ్ చేయడానికి ఇలాంటి చిల్లర ఆరోపణలు చేస్తున్నారని కవిత ఇంటిపై దాడులు చేయడం దుర్మార్గమైందన్నారు. కేంద్ర విచారణ సంస్థలు కీలుబొమ్మగా మారి కేంద్రాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. కార్యక్రమంలో ఉలిగుండం అనంత్‌రెడ్డి, గటరెడ్డిపల్లి రాంరెడ్డిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిఆర్ఎస్ నాయకులు

## అడ్డాకులలో కెసీఆర్ దిష్టిబొమ్మ దహనం

**అడ్డాకుల, ఆగస్టు 23, ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ని అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా మంగళవారం అడ్డాకుల మండల కేంద్రంలోని ఆర్‌టిసి బస్టాండు ఆవరణలో బిజెపి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కెసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గట్టు మల్లేష్, వెంకట్‌సాగర్, రమేష్ సాగర్, బుచ్చన్న యాదవ్, కావలి రాజు, తిరుపతి నాయక్, గంగుల రాజశేఖర్ రెడ్డి, కురుమూర్తి యాదవ్, రమేష్, వీరేష్, వినోద్‌కుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



అడ్డాకులలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బిజెపి కార్యకర్తలు

## ఆలయ ముఖ ద్వారానికి పూజలు

### -ఆలయ అభివృద్ధికి పాటుపడతా
### -సింగిల్ విండో మాజీ ఛైర్మన్ తిమ్మాజిపేట పాండు



ఆలయ ముఖద్వారానికి పూజ నిర్వహించేందుకు వస్తున్న సింగిల్‌విండో మాజీ ఛైర్మన్ తిమ్మాజిపేట పాండు

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** బోనాల పండగ సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈదమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాలకు వెళ్లే దారిలో ఇటీవల నిర్మించిన ఆలయ ముఖద్వారానికి తిమ్మాజిపేట పాడు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకులు కాలనీ వాసుల పుర ప్రముఖుల ఆర్థిక సాయంతో ఆలయ ముఖద్వారాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం ఆలయం వరకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోశాధికారి జాజుల బాలరాజు, ఉత్సవ నిర్వాహకులు శ్రీనివాసరావు, జగదీష్, కౌన్సిలర్లు నిజాముద్దిన్, సునీంద్రకాలనీ వాసులు రమేష్‌రావు, శేఖర్, మేస్త్రి కృష్ణయ్య, సత్యం, రాజారావు, భానుప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర హోంమంత్రిని కలిసిన అలంపూర్ ఎమ్మెల్యే

**ఇటిక్యాల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర హోంశాఖ మంత్రి మహిమూద్ అలీని బంజారాహిల్స్‌లోని మంత్రి నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం కలిశారు. ఈ సందర్భంగా అలంపూర్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న షాదీఖానా భవనం నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరగా హోంశాఖ మంత్రి సానుకూలంగా స్పందించి అలంపూర్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న షాదీఖానా భవన నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేసేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే అబ్రహాం తెలిపారు.



## విద్యుదాఘాతానికి గురై 3 గేదేలు మృతి

**కల్వకుర్తి, ఆగస్టు 23, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన మహబూబ్‌అలీ, వెంకటయ్యలకు చెందిన మూడు గేదేలు మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందడంతో రైతులు బోరున విలపించారు. మృతి చెందిన గేదేల విలువ సుమారు రూ. 2,40లక్షలు ఉంటుందని, తమ జీవనోపాధికి ఆధారమైన గేదేలు మృతి చెందడంతో ఏమి చేయాలో తోచడం లేదని రైతులు, రైతు కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులను పరామర్శించి తన వ్యక్తిగతంగా రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వ పరంగా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక తహసీల్దార్ రాంరెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిలతో మాట్లాడి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. అదే విధంగా వెటర్నరీ ఏడీ జగదీశ్వరి, పాలశీతలీకరణ అధ్యక్షులు శ్రీనివాస్‌గుప్త, పీఏసీఎస్ ఛైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డిలు సంఘటన స్థలానికి చేరుకొని బాధిత రైతులతో మాట్లాడి తమకు న్యాయం చేకూరేలా చూస్తామన్నారు. విద్యుదాధికారుల నిర్లక్ష్యంతోనే గేదేలు మృతి చెందాయని, వైర్లు తెగిపోవడం వల్ల తెగిన వైర్లకు గేదేలు తగలడంతో మృతి చెందాయని రైతులు పేర్కొంటున్నారు. విద్యుదాధికారులు స్పందించి రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. రైతులను పరామర్శించిన వారిలో గోరటి శ్రీనివాసులు, సతీష్, దున్న సురేష్, కుడుముల శేఖర్‌రెడ్డి, బండి నారాయణమూర్తి, శ్రీను, బాలరాజు, శివ ఉన్నారు.



బాధిత రైతులను పరామర్శిస్తున్న బృంగి ఆనంద్‌కుమార్

## ఘనంగా పోచమ్మ భోనాలు

### - ఆలరించిన పోతు రాజు విన్యాసాలు

**బిజినేపల్లి, ఆగస్టు22 ప్రభాతవార్త:** మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం ఘనంగా పోచమ్మ భోనాలు నిర్వహించారు, గ్రామాలలోని అమ్మవార్లకు పూజలు నిర్వహించిన అనంతరం డప్పు వాయిద్యలాతో వివిధ రకాల విత్తనాల మొలకల తోట్లు రకరకలా భోనాలు భక్తులు అందంగా అలంకరణ చేసి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు శ్రావణ మాసం మొక్కార్తి రెండు కలిసి రావడంతో మండలంలోని దాదాపు అన్ని గ్రామాలు భోనాల పండగను జరుపుకుంటున్నారు. వర్షాకాలంలో వచ్చే రోగాలకు,రైతులు పండించే పంటలకు అమ్మవార్ల చల్లని దీవేనలు ఉండేలా చూడాలని భక్తులు అమ్మవార్లకు భోనాలు సమర్పించారు,అందంగా ఆలంకరించిన భోనాలతో పాటు మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం యువత ఆధ్వర్యంలో పోతురాజు వేశదారణతో పాటు మహిళలు బోద్దేమ్మలు, కోలాటాలు, ఆటపాటలతో ప్రజలను ఆలరించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సర్పంచ్ సితార, యంపిటిసి రఘుమారెడ్డి, గ్రామపెద్దలు కావలి వెంకటయ్య, ఆతినారపు తిరుపతయ్య, మట్ట వెంకట్‌రాములుగౌడ్, మిద్దె యాదయ్య, నట్టల భాలస్వామి, మస్కూరి, బంగారయ్య, వంగరాములుగౌడ్, జగ్గని కోటయ్య, సాకలి భాష, నవీన్‌రెడ్డి, వంగ ఆంజనేయులుగౌడ్, సూరేష్‌గౌడ్, బాలస్వామిగౌడ్, యండి సలాం,జగ్గని రామకృష్ణ, మస్కూరి శేఖర్, జగ్గని సుధాకర్ తదితరులు పాల్గోన్నారు.


భక్తులను ఆలరిస్తున్న పోతురాజు విన్యాసాలు

## మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే ఆల

**దేవరకద్ర రూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం వెంకటాయపల్లిలో మంగళవారం మృతురాలి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. గ్రామ టీఆర్ఎస్ నాయకుడు రంగయ్యాగౌడ్ తల్లి ఎల్లమ్మ గత కొన్ని రోజుల క్రితం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ఆల ఆ గ్రామానికి వెళ్ళి మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రంగయ్యాగౌడ్‌ను ఎమ్మెల్యే అన్ని విషయాలు అడిగితెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యుగేందర్‌రెడ్డి నాయకులు కృష్ణయ్య, శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, కొండభాస్కర్‌రెడ్డి, చల్మారెడ్డి, భాలసాయన్న యూత్ నాయకులు యుగేందర్‌రెడ్డి, చల్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

## తెలుగు భాష అమృతోత్సవాలలో మల్దకల్ వాసికి ప్రశంసా పత్రం

**గద్వాల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** సేవ తెలుగుభాష, సాహితి సాంస్కృతిక సంస్థ, తెలంగాణ ప్రభుత్వం భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి, సుప్రసిద్ద స్వాతంత్ర సమర యోధుడు అయిన టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగుభాష అమృతోత్స వాలను మంగళవారం ప్రారంభించారు. హైదరాబాద్ రవింద్ర భారతిలో కవి సమ్మేళనం, సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కవి సమ్మేళనానికి మల్దకల్ గ్రామ నివాసి, అధ్యాపకులు సుంకరి బసవరాజప్ప పాల్గొని తన కవితగానం చేసినందుకు అభినందిస్తూ, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించారు. నిర్వాహకులు, సంస్థ అధ్యక్షుడు కంచెర్ల సుబ్బనాయుడు, సినిగేయ రచయిత, సాహిత్యవేత్త వడ్డేపల్లి కృష్ణ, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు దాస్యం సేనధిపతి, ప్రముఖ కవి, సాహితీవేత్త డా. దామెర రాములు, నందిగామ కిశోర్, ఎంఎన్ విజయ్‌కుమార్, డా. మంగళగిరి శ్రీనివాసులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.


మల్దకల్ వాసికి ప్రశంసా పత్రం అందజేస్తున్న దృశ్యం

## పర్యావరణాన్ని కాపాడుకుందాం

**వీపనగండ్ల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** పల్లె ప్రకృతి వనాలలో ప్లాస్టిక వ్యర్థ పదార్థాలను పడేయకుండా పర్యావరణాన్ని కాపాడుకోవాలని వీపనగండ్ల ఎంపిడిఓ కతలప్ప, సర్పంచ్ వి. నరసింహారెడ్డి ప్రజలకు పిలుపు నిచ్చారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వీపనగండ్ల మండల కేంద్రంలో మంగళవారం పోచమ్మ బోనాల పండగ ప్రజలు జరుపుకుంటున్న సందర్భంలో పల్లె ప్రకృతి వనంలోనే పోచమ్మ గుడి ఉన్నదని అక్కడికి పెద్ద ఎత్తున తరలిస్తున్న మహిళలు ప్లాస్టిక్ బ్యాగులలో టెంకాయలు, పూల కుండీల ద్వారా తీసుకురావడం జరుగుతుందని వాటిని పల్లె ప్రకృతి వనంలో ఉన్న పూలమొక్కల మధ్య పడేయవద్దని కోరారు. ప్రకృతి వనాలు ఎంత శుభ్రంగా ఉంటే అవి మనకు వాతావరణ కాలుష్యం ద్వారా రక్షణ ఇస్తాయని ప్రజలు వీటిని విస్మరించరాదని వారు ఈసందర్భంగా తెలిపారు. గ్రామ సిబ్బంది ద్వారా మొక్కలకు అక్కడక్కడ హెచ్చరికలు జారీ చేయడం జరుగుతుందని వాటిని గమనించాలని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ పర్యవేక్షణలో గ్రామ పారిశుద్ధ్య కార్మికులతో పాటు వీరబాబు, జంగం శివరాజు పాల్గొన్నారు.


ప్రకృతి వనంలో సూచికల బోర్డులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

## ధరూర్ మండల సర్వసభ్య సమావేశం

**ధరూర్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** ధరూర్ మండల కేంద్రంలో ఎంపిడిఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపిపి నజుమున్నిసాబేగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. జడ్పీటిసి పద్మ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డిలు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు కారకులని అన్నారు. గ్రామాలలో తాగునీరు వృథా కాకుండా పైప్‌లైన్ వేయించి డ్రైనేజీ వ్యవస్థను, పారిశుద్ధ్య కార్యక్రమంలో చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుని గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటిసి పద్మ వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ఎంపిడిఓ జబ్బార్, గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

## మహేశ్వరి కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు అందజేత

**దేవరకద్ర, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని స్థానిక హరిజనవాడ అంబేద్కర్ నగర్‌కు చెందిన చిన్నారి తల్లి ఎద్దుల మహేశ్వరి గత శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుటుంబ సభ్యులకు మంగళవారం గోపన్‌పల్లి గ్రామానికి చెందిన యువకులు మెకానిక్ శ్రీనివాసులు, యాదగిరి, బుచ్చన్నలు తమవంతు సహాయంగా వారి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం యువకులు ఎల్లప్ప, సదానంద్, చిన్న నర్సింలు, సత్యనారాయణ, కురుమన్న, కిశోర్ పాల్గొన్నారు.


బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

## వీపనగండ్లలో పోచమ్మ బోనాలు

**వీపనగండ్ల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మృగశిరకార్తి సందర్భంగా గ్రామీణ ప్రాంతంలో పోచమ్మ బోనాలు ప్రజలు పెద్దఎత్తున జరుపుకున్నారు. ఈసందర్భంగా వీపనగండ్ల మండల కేంద్రంలో పోచమ్మ బోనాలు మహిళలు చేసి అమ్మవారికి సమర్పించారు. ఈ పండగ సందర్భంగా ఆడపడుచులను తమ ఇంటికి తీసుకుని వచ్చి బోనాలు నెత్తిన ఎత్తుకుని పోచమ్మ గుడివద్దకు బయలుదేరి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.


బోనాలతో బయలుదేరిన మహిళలు

# కానిస్టేబుల్ పోస్టుల నియామక ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

### - అభ్యర్థులు ఒకరోజు ముందుగానే పరీక్ష కేంద్రంను చూసుకోవాలి

**గద్వాల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని హిమాలయ హోటల్ బాంకెట్ హాల్‌లో మంగళవారం ఉదయం 10 గం.లనుండి 12 గం.లకు వరకు తెలంగాణ రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియమావళి మేరకు పరీక్ష కేంద్రాలలో పరీక్ష నిర్వహణపై బయోమెట్రిక్ ఇన్విజిలేటర్‌లకు బయో మెట్రిక్ ఎన్‌రోల్‌మెంట్ ప్రాసెస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరీక్ష నిర్వాహకులకు బయోమెట్రిక్ ఎన్‌రోల్‌మెంట్ ప్రాసెస్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములునాయక్, జిల్లా ఎస్పీ రంజన్ రతన్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్ ఆధ్వర్యంలో ఆగస్టు 28వ తేదీన జరగబోయే కానిస్టేబుల్ పోస్టుల ప్రిలిమినరీ నియామక పరీక్షకు సంబంధించి ఈ సందర్భంగా కానిస్టేబుల్ పోస్టుల నియామక ప్రిలిమినరీ పరీక్ష నోడల్ ఆఫీసర్ జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, రీజినల్ కో ఆర్డినేటర్ రాంమోహన్, పరీక్ష నిర్వాహకులకు, ఇని ్వజిలేటర్‌లకు బయోమెట్రిక్ ఎన్‌రోల్‌మెంట్ ప్రాసెస్‌పై పకడ్బందీగా పరీక్షల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ, రీజినల్ కో ఆర్డినేటర్‌లు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీన కానిస్టేబుల్ పోస్టుల ప్రిలిమినరీ నియామక పరీక్ష జిల్లా కేంద్రంతో పాటు గోనుపాడు, ధరూర్, మల్దకల్, ఎర్రవల్లి చౌరస్తాలలో మొత్తం 32 పరీక్షా కేంద్రాలలో 11,420 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ప్రతి 200ల మందికి ఒక బయోమెట్రిక్ ఇన్విజిలేటర్‌ను నియమించడం జరిగిందని, ప్రతి సెంటర్‌కు అదనంగా పోలీస్ బయోమెట్రిక్ అధికారిని సపోర్టుగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష ఉదయం 10 గం.ల నుండి మధ్యాహ్నం 1 గం.ల వరకు ఉంటుందని ఉదయం 9 గం.ల నుండే బయో మెట్రిక్ ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రారంభించాలని సిబ ్బందికి సూచించారు. ట్యాబ్‌లలో అభ్యర్థుల బయోమెట్రిక్ ఎన్‌రోల్‌మెంట్ ప్రాసెస్ చేయడం జరుగుతుందని తెలియజేస్తూ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను ప్రొజెక్టర్ ద్వారా మెడో చూపిస్తూ శిక్షణ ఇవ్వడం జరిగింది. కానిస్టేబుల్ ప్రిలిమినరీ నియామక పరీక్షకు బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రలు తీసుకోవడం జరుగుతుందని, అభ్యర్థులు తమ చేతులకు గోరింటాకు, మెహందీ లాంటి ఉపకరణాలు వాడవద్దని అన్నారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రాన్ని ఒకరోజు ముందుగానే సందర్శించి చూసుకోవాలని, ఉదయం 10 గం.ల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా అనుమతించడం జరగదని అన్నారు. పరీక్షకు సంబంధించిన నిబంధనలు పూర్తిగా హాల్ టికెట్లో పొందుపరిచి ఉంటాయని, అభ్యర్థులు ఒకటికి రెండుసార్లు హాల్ టికెట్‌లోని నిబంధనలు చదువుకోవడం మర్చిపోవద్దని, పరీక్ష హాలులోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, ఇతర వస్తువులకు అనుమతి ఉండదని అన్నారు. కానిస్టేబుల్ పోస్టుల ప్రిలిమినరీ నియామక పరీక్షను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని సిబ్బంది అందరు పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. అభ్యర్థులకు హాల్ టికెట్ల డౌన్‌లోడ్ విషయంలో గాని, హాల్ టికెట్‌లో ఏమైనా పేర్లు, ఇతర వివరాలు తప్పుగా ప్రింట్ అయిన ఎవరికి ఎలాంటి సందేహాలు ఉన్నా జిల్లా నోడల్ అధికారి సెల్ నం. 8332890011, రీజినల్ కో ఆర్డినేటర్ సెల్ నం. 8008613416 నంబర్లకు కాల్ చేసి అభ్యర్థులు తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ కో ఆర్డినేటర్ బాలాజీ, పాలిటెక్నిక్ కళాశాల ఎఓ సిద్దలింగయ్య, డిసి ఆర్బీ ఇన్స్‌పెక్టర్ శివకుమార్, పోలీస్ బయోమెట్రిక్ అధికారులు చంద్రకాంత్, నందికర్, పరీక్షా కేంద్రాల అబ్జర్వర్లు, బయో మెట్రిక్ ఇన్విజిలేటర్‌లు, ఐటి సెల్ ఇంఛార్జి నాగరాజు, సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షపై అవగాహన కల్పిస్తున్న అదనపు ఎస్పీ

## దురదృష్టకర సంఘటనలు పునరావృతం కానివ్వద్దు

### - ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి టైగర్ జంగయ్య మాదిగ

**జడ్చర్ల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** దళితులపై అంటరానితనం, వివక్షతో కూడిన దాడులు, హత్యలు, అత్యాచారాలు పునరావృతం కానివ్వకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి టైగర్ జంగయ్య మాదిగ డిమాండ్ చేశారు. కుండలో నీళ్ల తాగాడన్న కారణంగా 3వ తరగతి చదివే రాజస్థాన్‌కు చెందిన 9 ఏళ్ల దళిత బాలుడు ఇంద్రకుమార్ మేఘ్వాల్‌ను ఆ స్కూల్ టీచర్ చైల్‌సింగ్ అమానుషంగా అత్యంత కిరాతకంగా కొట్టి దారుణంగా హింసించడంతో ఆసుపత్రి పాలై చికిత్స పొందుతూ 10 రోజుల తర్వాత మరణించిన సంఘటన అమానవీయమని అన్నారు. జరిగిన సంఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఇచ్చిన బంద్ పిలుపు మేరకు స్వచ్చందంగా సహకరించిన ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల యాజమాన్యానికి, విద్యార్థులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు వారు పట్టణంలో ర్యాలీ నిర్వహించి కొనసాగుతున్న విద్యా సంస్థలను మూయించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ వినోద్‌కుమార్ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో గంగాపూర్ భీంరాజ్ మాదిగ, యాదయ్య మాదిగ, కృష్ణ మాదిగ, బెల్లం శివ మాదిగ, అల్లాజీ, వెంకటేష్ మాదిగ పాల్గొన్నారు.


విద్యా సంస్థల బంద్ కార్యక్రమంలో నాయకులు

## ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : తపస్

**మహబూబ్‌నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని పాఠశాలల సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా ఉపాధ్యాయ బదిలీల, పదోన్నతుల ప్రక్రియ మొదలు కావడం లేదని వెంటనే చేపట్టాలని ఆయన కోరారు. 317 జిఓకు సంబంధించి అన్ని అప్పీళ్లను పరిష్కరించాలని, బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌస్ బదిలీలను వెంటనే చేపట్టాలని, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్దరించాలని, కెజిబివి మాడల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని, ప్రతి పాఠశాలకు స్కావెంజర్‌లను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి. కరుణాకర్‌గౌడ్, బి. సునిల్‌కుమార్, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రకాంత్‌రెడ్డి, రాఘవ, శివకుమార్, సత్యనారాయణ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కె. హనుమంతరావు

## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు -ఎస్సై మాధురి

**నారాయణపేట, ఆగస్టు 23 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జిల్లా షీటీమ్ ఇంఛార్జి ఎస్సై సుధ మాధురి, షీటీమ్ పోలీసులు కోస్గిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, కెజిబివి నాచారం స్కూల్‌లో విద్యార్థులకు షీ టీమ్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధామాధురి మాట్లాడుతూ ఇటీవల మహిళలపై దాడులు, వేధింపులు, ఆడపిల్లల పట్ల సోషల్ మీడియాలో అనుచితంగా పోస్టులు పెట్టి మహిళలను శారీరకంగా మానసికంగా వేదిస్తున్నారు. అలాంటి వారికి బుద్ది చెప్పడానికి జిల్లాలో షీటీమ్ పోలీసులు పని చేస్తున్నారు. మహిళలను, ఆడపిల్లలను వేధింపులకు గురి చేసినా, శారీరకంగా, మానసికంగా బాధకు గురి చేసిన తల్లిదండ్రుల సహాయంతో ధైర్యంగా జిల్లా షీటీమ్ పోలీస్ హెల్ప్‌లైన్ 7901022492కు కాల్‌చేసి లేదా డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలను గోప్యంగా ఉంచి ఆకతాయిలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని ఎస్సై తెలిపారు. అదేవిధంగా షీటీమ్ కంప్లైంట్ క్యూఆర్ కోడ్ స్కానింగ్ పోస్టర్‌ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, షీటీమ్ పోలీసులు మమత, బాల్‌రాజ్, లయక్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్సై మాధురి

## రాజాపూర్‌లో ఘనంగా పోచమ్మ బోనాలు

**రాజాపూర్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో మంగళవారం పోచమ్మ బోనాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నా, పెద్ద తేడా లేకుండా బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల సందర్భంగా పోచమ్మ అమ్మవారి ఆలయాన్ని పూల తోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. బోనాలు ఊరేగింపుగా వెళ్తున్న సమయంలో పోతురాజుల నృత్యాలు, మహిళల ఆటపాటలు పలువురిని అలరించాయి. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. గ్రామంలోని పురవీదుల గుండా ఊరేగింపుగా వచ్చిన బోనాల ఎపిజివిబి బ్యాంకు దగ్గర అన్ని ఒకేచోటకు చేరుకుని అమ్మవారి దర్శనానికి బయలుదేరి వెళ్లాయి. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ బచ్చిరెడ్డి, పలు పార్టీల నాయకులు, యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

## విజెఆర్ ఫౌండేషన్ అధినేతకు విఆర్‌ఎలు వినతిపత్రం అందజేత

**ఉట్కూర్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** సీఎం కెసిఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ విజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డికి విఆర్‌ఎలు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ సీఎం కెసిఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ నారాయణపేట జిల్లా విఆర్‌ఎల సంఘం నాయకులు మంగళవారం విజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి తమ సమస్యలు ప్రభుత్వ పరంగా పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వర్కటం సానుకూలంగా స్పందించి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లి విఆర్‌ఎల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా ఛైర్మన్ రాజప్ప, కన్వీనర్ బండారి కృష్ణ, అశోక్, రమేష్‌లు ఉన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న విఆర్‌ఎలు

## దేవాలయ స్లాబ్ పనులను ప్రారంభించిన సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి

**వెల్దండ, ఆగస్టు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న ఈదమ్మ దేవాలయ స్లాబ్ పనులను మంగళవారం వెల్దండ మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి స్లాబ్ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ స్లాబ్ పనులను నాణ్యవంతంగా చేపట్టి త్వరితగతిన అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, చలిచీమల నిరంజన్, దేవేందర్, ప్రభాకర్, శేఖర్, ఆంధ్రయ్య, బాల్‌రాంతో పాటు తదితరులు ఉన్నారు.


స్లాబ్ పనులకు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

## పాఠశాలలు, కళాశాలల బంద్ విజయవంతం

**కల్వకుర్తి, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాజస్థాన్ రాష్ట్రంలోని జల్లూరు జిల్లా సూరానా గ్రామంలో ప్రైవేటు పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న దళిత విద్యార్థి ఇంద్రకుమార్ పాఠశాలలో నీరు తాగడాన్ని కోపొద్రిక్తుడై విద్యార్థిని చావగొట్టిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల బంద్ నిర్వహించారు. మంగళవారం ఎమ్మార్పీఎస్ తాలూకా ఇన్‌చార్జి పరుశపాకుల శేఖర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారతీయ విద్య వ్యవస్థలోని కుల, మత, మతోన్మాద, దళిత వ్యతిరేకులమని మరోసారి రుజువు చేస్తున్నాయని, విద్యార్థి చావుకు కారణమైన ఉపాధ్యాయుడిని శిక్షించి విద్యార్థి కుటుంబానికి రూ.1కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్, శేఖర్, బండ్ల గణేష్, నవీన్, పరుశరాం, మొహమ్మద్, ఖాదర్, జనతా ఖాదర్, సత్తార్, ఖాదర్, మక్బూల్, అచల్, చావుస్, ఖుద్దుస్, హుస్సేన్, ఖుద్దుస్, సోఫి తదితరులు ఉన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## 108 సేవలు ప్రారంభం


108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, ఆగస్టు 23, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని తలకొండపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత రెండు నెలల క్రితం జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.25లక్షలతో అంబులెన్స్‌ను మండలానికి అందించారు. మంగళవారం 108 ద్వారా అంబులెన్స్ సేవలను ఎంపీపీ తిరుమణి నిర్మల శ్రీశైలం, సర్పంచ్ లలిత జ్యోతయ్యలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మండలంలో 24 గంటలు అంబులెన్స్ అందుబాటులో ఉంటుందని, అత్యావసర పరిస్థితులలో అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 108 ప్రోగ్రామ్ మేనేజర్ సీహెచ్.నరేందర్, 108 జిల్లా కోఆర్డినేటర్ వై.రమేష్, పైలెట్ శ్రీనివాస్, మెడికల్ టెక్నిషియన్ సురేందర్, ఎంపీటీసీ జోగు రమేష్, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్, యాదయ్య, వార్డు సభ్యులు విఠల్, కోటీశ్వర్, రవి, శ్రీను, గ్రామస్తులు జగతయ్య, అరవింద్, వెంకటయ్య, పాషా, వెంకటేష్‌యాదవ్, మల్లేష్, చంద్రయ్య, రాంచంద్రయ్య, ఆసుపత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ఆధార్ అనుసంధానం తప్పని సరి...

### - తహసీల్దార్ రాజునాయక్

**వంగూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:** ప్రతి ఓటర్ తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని తహసీల్దార్ రాజునాయక్ పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బీఎల్ఓలతో సమావేశంవ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు గ్రామంలోని ప్రతి పౌరుల దగ్గరుకు వెళ్లి ఆధార్ అనుసంధానం చేయించాలని సూచించారు. కార్యదర్శులు, బీఎల్ఓలు తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజునాయక్

## సెప్టెంబరు 7న కాంగ్రెస్ జోడోయాత్ర

### - టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి

**దేవరకద్ర రూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** సెప్టెంబరు 7న కాంగ్రెస్ పార్టీ జోడోయాత్ర నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. దేవరకద్రలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ నిరంకుశ పాలనకు, అధికధరలకు నిరసనగా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు రాహుల్‌గాంధీ దాదాపు 150 రోజుల చొప్పున 4000 కిలోమీటర్ల మేర ఈ పాదయాత్ర చేయనున్నట్లు ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. సామాన్య ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించడానికే ఈ జోడోయాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

## సఖితో మహిళలకు రక్షణ

**బిజినేపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త :** సఖి కేంద్రంతో మహిళలకు రక్షణ కల్పిస్తు ఆత్మగౌరవంతో మహిళలు జీవించడానికి సఖి కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని కేవికే శాస్త్రవేత్త ఆసిపాజహాన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాలెం కేవికేలో రావేప్ విద్యార్థినిలకు సఖి సంటర్ సేవలపై మరియు సైబర్ క్రైమ్ మహిళా సమస్యలపై పనిచేస్తున్న టోల్‌ఫ్రీ నెంబర్స్‌పై ఆవగాహణ కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు గృహహింస, వరకట్న వేదింపులు,భాల్యవివాహలు,లైంగిక వేదింపులు,సైబర్ నేరాలపై అవగాహణ కల్గివుండాలని తెలిపారు,మహిళ శిశుసంక్షేమశాఖ పర్యవేక్షణలో స్వచ్చంద సంస్థ శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో ఈ సఖి కేంద్రం 24గంటలు పనిచేస్తుందని తెలిపారు,ఈ కేంద్రం ద్వార మహిళలకు పోలిస్ సహయం,న్యాయ సలహాలు,వైద్య సేవలు ఆవసరం ఉన్న మహిళలకు 5రోజుల తాత్కలిక వసతి మరియు భాదిత మహిళ వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు,జిల్లాలో హింసకు లోనవుతున్న మహిళలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్181 లేదా సఖి సెంటర్ నెంబర్9951940181కు సంప్రదించాలని తెలిపారు. సఖి సెంటర్ నిర్వహకురాలు సునిత, రేణుక ఉన్నారు.


రావేప్ విద్యార్థులకు ఆవగాహణ కల్పిస్తున్న శాస్రవేత్తలు

# బిజెపి నాయకుల నిరసన







**నాగర్‌కర్నూల్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మంగళవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షులు, కరీంనగర్ ఎంపి బండి సంజయ్ కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సాయంత్రం 4 గం.ల నుండి 5 గం.ల వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన, మౌనదీక్ష చేయడం జరిగింది. అనంతరం ర్యాలీగా వెళ్లి కెసిఆర్ ఫ్లెక్సీని బస్టాండ్ కూడలిలో లిక్కర్‌తో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కన్వీనర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఎక్సైజ్ పాలసీ ద్వారా పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతుందని రెండుశాతం ఉండాల్సిన కమిషన్ 27 శాతం చేసి పేద, బడుగు, బలహీన, మధ్య తరగతి కుటుంబాలను తాగుడుకు బానిసలుగా చేసి కల్వకుంట్ల కుటుంబం దోపిడి చేస్తున్నారన్నారు. అనేక జిఓలు విడుదల చేసి వాటిని పారదర్శకంగా లేకుండా దాచిపెడుతున్నారు. లిక్కర్ దందా ద్వారా ఇబ్బడి ముబ్బడిగా డబ్బులు సంపాదించే మార్గానికి బాగా అలవర్చుకున్న పద్ధతిని ఢిల్లీకి అక్కడి నుండి పంజాబ్, పశ్చిమ బెంగాల్‌కు ఎగుమతి చేయాలని కెసిఆర్ కుటుంబ సభ్యులు వారి అనుయాయులు ఢిల్లీ ప్రభుత్వ మంత్రులతో కుమ్మక్కై 150 కోట్లు వసూలు చేశారు. ఆరు నెలలు ఒబరాయ్ హోటల్ షూట్స్‌తో మంతనాలు చేసి రెండుశాతం కమిషన్‌ను కాస్త పన్నెండు శాతం చేసి 150 కోట్లు కమిషన్‌గా వసూలు చేయడం జరిగింది. దీనిపై సిబిఐ ఎంక్వయిరి మొదలు పెట్టగానే తెలంగాణ రాష్ట్ర ప్రజలు టిఆర్ఎస్ పట్ల విముఖత కనబరుస్తున్న స్థాయి తీవ్రమవుతున్నదని కెసిఆర్ కుటుంబ గ్రహించింది. రాష్ట్ర వ్యాప్తంగా భాజపా శ్రేణులు లిక్కర్ డాన్‌లకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహిస్తున్న సందర్భంలో ప్రజల దృష్టిని మరల్చడానికి బండి సంజయ్‌కుమార్‌ను అరెస్టు చేయడం జరిగిందని అయినంత మాత్రాన ఈ నిరసనలు ఆగవని అన్నారు. అక్రమ అరెస్టులను నివారిస్తామని నిరంతరంగా లిక్కర్ వ్యవహారంలో దోపిడీలో నిమగ్నమై ఉన్న కల్వకుంట్ల కుటుంబం దోపిడీల పట్ల అన్యాయాల పట్ల నిరసనలు చేస్తూనే ఉంటామని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలు కూడా ఈ కుటుంబ పాలన అంతం చేస్తారని నమ్ముతున్నామని అన్నారు. తదనంతరం లిక్కర్ బాటిల్‌తో కెసిఆర్ ఫ్లెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దొడ్ల రాజవర్ధన్‌రెడ్డి, కృష్ణగౌడ్, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు నిరంజన్‌గౌడ్, నాయకులు డా. శివలింగం, బాల్‌రాజు, ఈశ్వర్, వేణుచారి, చంద్రశేఖర్, మహేష్, మాయని శ్రీశైలం, బచ్చిరెడ్డి, ఎలిమెరాము, చిక్కొండ చందు, సూరిబాబు, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

**వీపనగండ్లలో..** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టుతో వీపనగండ్ల మండల కేంద్రంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై రామన్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాలలో మత విద్వేషాలు రెచ్చగొట్టకుండా ప్రజలు సామరస్యంగా ఉండాలని ఎలాంటి గొడవలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన ప్రజలను కోరారు.

**గోపాల్‌పేటలో..** భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ అక్రమ అరెస్టుకు నిరసనగా బిజెపి మండలశాఖ ఆధ్వర్యంలో గోపాల్‌పేట బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేస్తూ ఆర్‌అండ్‌బి రోడ్డుపై బైఠాయించారు. అనంతరం పోలీసులు వచ్చి పోలీస్ స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేయగా బిజెపి నాయకులు బస్టాండ్ నుండి ర్యాలీగా స్టేషన్ వరకు వెళ్లారు. లిక్కర్ స్కాంలో ఆరోపణపై సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కెసిఆర్ కుమార్తె కవిత ఇంటివద్ద ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న బిజెపి కార్యకర్తలను అరెస్టు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు అరవింద్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణయాదవ్, మాధవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కేశవులు, నాగరాజు, కిసాన్‌మోర్చా అధ్యక్షుడు వెంకటేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు అరుణ మండల ఉపాధ్యక్షుడు వామన్‌గౌడ్, మండల సెక్రెటరీ సురేష్‌గౌడ్, నాయకులు శ్రీశైలం, తిరుపతి, నరెందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**ఇటిక్యాలలో..** భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు ఇటిక్యాల మండలం ఎర్రవల్లి చౌరస్తాలో ఇటిక్యాల బిజెపి శాఖ మండలం అధ్యక్షులు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. లిక్కర్ కుంభకోణంలో సీఎం కెసిఆర్ కూతురు ఎమ్మెల్సీ కవిత ప్రమేయం ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు లభించడంతో బిజెవైఎం బిజెపి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆమె నివాసం ఎదుట ధర్నా నిర్వహించినందుకు కక్ష పూరితంగా బిజెపి కార్యకర్తల మీద దాడిచేసి వారిని అక్రమంగా అరెస్టు చేసి కేసులు నమోదు చేయడం జరిగిందని వీరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కెకెరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తిమ్మారెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి మాణిక్యరెడ్డి, మండల ఉపాధ్యక్షులు శంకర్‌రెడ్డి, రవిగౌడ్, కార్యదర్శి రంజిత్‌కుమార్‌రెడ్డి, మండల కిసాన్‌మోర్చా అధ్యక్షులు ఎల్లరెడ్డి, బూత్ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కోయిల్‌కొండలో..** తెలంగాణలోని టిఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని జిల్లా బిజెపి నేత, మండల బిజెపి మాజీ అధ్యక్షుడు గార్లపాడు వెంకట్‌రాంరెడ్డి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. మంగళవారం ఆయన మండల కేంద్రమైన కోయిల్‌కొండలో విలేఖరులతో మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపడుతున్న ప్రజాసంగ్రామ యాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుండడంతో చూసి ఓర్వలేని ప్రభుత్వం అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమన్నారు. పాదయాత్రలో తెలంగాణ ప్రభుత్వ తప్పిదాలను ఎక్కడికక్కడే ఎండగట్టడం చూసిన టిఆర్ఎస్ ప్రభుత్వం జీర్ణించుకోలేక ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పూనుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే బండి సంజయ్ ప్రజాసంగ్రామ యాత్ర చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

**వెల్దండలో..** లిక్కర్ స్కాం అవినీతిపై శాంతియుతంగా నిరసన చేస్తున్న బీజేపీ కార్యకర్తలపై టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడి చేయడం ఏ మాత్రం తగదని జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు కుర్మిద్ద యాదగిరి, మాజీ ఎంపీటీసీ జంగయ్యయాదవ్, జిల్లా నాయకులు జూలూరి బాలస్వామి, మట్ట పరమేష్‌గౌడ్‌లు అన్నారు. మండల కేంద్రంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మంగళవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ అప్రతిష్ట పాలవుతున్నామనే ఉద్దేశ్యంతోనే బీజేపీ కార్యకర్తలపై దాడి చేస్తున్నారని, వారి అవినీతిని కప్పి పుచ్చుకోవడానికి ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. దాడి చేసిన నాయకులను అరెస్ట్ చేయకుండా బీజేపీ నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటుకరమని, అరెస్ట్ చేసిన బీజేపీ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దువ్వాసి రామస్వామి, అందోజు శ్రీనివాసాచారి, వెంకటయ్య, రవికుమార్, ప్రవీణ్, మల్లేష్, నర్సిరెడ్డి, కొండల్‌రెడ్డి, శివ, కొండల్, అనిల్, రామకృష్ణతో పాటు తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన దేవరకద్ర బాలన్న

**అడ్డాకుల, ఆగస్టు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన బిజెపి మండల ఉపాధ్యక్షులు బుచ్చన్న యాదవ్ సోదరుడు ఈర్ల మల్లేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బిజెపి రాష్ట్ర నాయకులు, జనసురక్ష పౌండేషన్ అధినేత దేవరకద్ర బాలన్న మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబానికి జనసురక్ష పౌండేషన్ తరపున ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రమేష్ సాగర్, బుచ్చన్న యాదవ్, వినోద్, అంజన్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.


మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న దేవరకద్ర బాలన్న

## సిద్ధి వెంకటేశ్వర్లు మరణం ఉద్యమాలకు తీరని లోటు

**మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 22, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ది వెంకటేశ్వర్లు మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. అమర జీవి సీపీఐ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి సిద్ది వెంకటేశ్వర్లు చిత్రపటానిని మంగళవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ సిద్ది వెంకటేశ్వర్లు విద్యార్థి దశనుండే వామపక్ష అభ్యుదయ భావజాలాన్ని ఉనికి పుచ్చుకుని, విద్యార్థి, యువజన సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతానికి చివరి వరకు కృషి చేసిన మహనీయుడు సిద్ది వెంకటేశ్వర్లు ఆశయాలను ముందుకు తీసుకెల్లాలని కోరారు. సమావేశంలో నాయకులు సురేష్, గోవర్ధన్, అల్వాల్‌రెడ్డి, సంతోష్, రాజు, భాష, లక్ష్మణ్, శంకర్, పాషా పాల్గొన్నారు.


అమరుడు సిద్దివెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న నాయకులు

## ఘనంగా బోనాల ఉత్సవాలు -అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

**నాగర్‌కర్నూల్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ పట్టణంలో ఈదమ్మ, పోచమ్మ బోనాల ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఈదమ్మ, పోచమ్మ గుడిలో గ్రామ దేవతలు, బొడ్రాయి, అమ్మవారి ఆలయాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరకంగా అలంకరించారు. మంగళవారం తెల్లవారుజాము నుండే గ్రామ దేవతలను దర్శించుకునేందుకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని వివిధ కాలనీల నుండి ఊరేగింపుగా బోనాలతో బయలుదేరి వెళ్లారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులను ఆకట్టుకున్నారు.


బోనాలతో మహిళలు

## ట్రాఫిక్ సమస్యను పరిశీలించిన ఎస్పీ

**జడ్చర్ల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** ట్రాఫిక్ సమస్యల నేపథ్యంలో జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు మంగళవారం జడ్చర్లను సందర్శించారు. జడ్చర్ల మున్సిపల్ పరిధిలోని నేషనల్ హైవే, న్యూ బస్టాండ్ సమీపంలోని ఫ్లైఓవర్ కింద రోజు రోజుకు వాహనాల రద్దీ ఎక్కువవుతున్నందున చర్యలు చేపట్టాలని స్థానిక సిఐ రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్‌కు సూచించారు. దీంతో పెరుగుతున్న వాహనాల రద్దీ తగ్గించే క్రమంలో ఈసర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ ముందు, ఫ్లై ఓవర్ కింద ఉన్న డివైడర్లను ప్రొక్లయినర్‌తో తొలగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చైతన్య చౌహాన్, ముడా డైరెక్టర్ వైజి ప్రతీమ్, తెరాస నాయకులు కృష్ణారెడ్డి, కాశి విశ్వనాథం, దోరేపల్లి రవిందర్, నరసింహ యాదవ్, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.


ట్రాఫిక్ సమస్యను పరిశీలిస్తున్న ఎస్పీ

# భూత్పూర్‌లో ఘనంగా బోనాల సంబరాలు

## -ఊరేగింపులో పాల్గొన్న ప్రముఖులు

**భూత్పూర్, ఆగస్టు23, ప్రభాతవార్త :** గ్రామదేవత పోచమ్మతల్లికి బోనం సమర్పించేందుకు భూత్పూర్ పట్టణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బోనం ఘటాలతో భూత్పూర్ జనసంద్రమైంది. బోనాల ఊరేగింపు బాజాభజంత్రీలు, డప్పుల చప్పులు, మంగళవాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలతో సాగింది. ఊరేగింపులో అధికార పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్తూరు నారాయణగౌడ్, తోక మురళీధర్‌గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు బీజేపీకి చెందిన కిషాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు సుదర్శన్‌రెడ్డి, కౌన్సిలర్ ఫరూఖ్‌హుస్సేన్, రవీందర్, శ్రీశైలం, మల్లేష్, హరినాథ్, సురేందర్, ఆప్‌కు చెందిన గడ్డం ఎల్లప్ప తదితరులతో పాటు నాయకులు సత్తూరు అశోక్‌గౌడ్, సత్తూరు రాకేష్‌గౌడ్, సత్తూరు సురేష్‌గౌడ్, వడ్ల బ్రహ్మయ్య, రాముర‌ాథోడ్, దళితరత్న బోరింగ్ నర్సింహులు, గడ్డం రాములు, గడ్డం యాదయ్య, గడ్డం ప్రేమ్, మండి ఆటో వెంకటయ్య, తదితరులు హాజరై తమ మొక్కులు తీర్చుకున్నారు. తొలుత ఘటాల ఊరేగింపు బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, పాతబస్తీ, తెలుగువీథి, అంజనేయస్వామి దేవాలయ ప్రాంతం, శివాలయ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున మహిళలు బోనాల ఊరేగింపు నిర్వహించారు. పట్టణానికి సమీపంలో అవసలోన్‌బావి దగ్గర వెలసిన పోచమ్మతల్లికి బోనం సమర్పించి తమ మొక్కులతో పాటు పోచమ్మతల్లి అందరిని చల్లగా చూడాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూత్పూర్-నాగర్‌కర్నూల్ రోడ్ బోనాల ఊరేగింపుతో జనసంద్రంగా మారింది.


చెట్టుకింద వెలసిన పోచమ్మతల్లి


బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు


బోనాల ఊరేగింపులో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ సత్తూరు బస్వరాజ్‌గౌడ్

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థుల మానవహారం

**వెల్దండ, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రాజస్థాన్‌లో దళిత విద్యార్థి ఇంద్రకుమార్ హత్యను ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యా సంస్థలను బంద్ చేయించి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు గుద్దటి జనార్ధన్, రామస్వామిలు మాట్లాడుతూ మృతికి కారణమైన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌నాయకులు తదితరులు ఉన్నారు.


మానవహారం నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

## రాంరెడ్డిపల్లి గ్రామంలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**తెల్కపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామ్‌రెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు నిర్వహించారు. సాయంత్రం 6 గం.ల నుండి మహిళలు ఉపవాస దీక్షలతో బోనం కుండలను పూజించి రంగు రంగుల బొట్లు, పూలతో అలంకరించి నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించి బోనం ఎత్తి డప్పు చప్పుళ్లతో, శివసత్తుల ఆటలు పోతురాజుల ఆటలతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు వెళ్లి ప్రధాన రహదారిలో ఉన్న పోచమ్మ తల్లి దేవాలయం చేరుకుని బోనం కుండలతో ప్రదర్శనలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో చెన్నకేశవ యువజన సంఘం గ్రామపెద్దలు పాల్గొన్నారు.


బోనాలతో బయలుదేరిన మహిళలు

## వైభవంగా వన మహోత్సవం

**లింగాల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన లింగాల గ్రామస్తులు మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, పశుపక్ష్యాదులు ఆరోగ్యంగా ఉంటూ వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, తమకు జీవనాధారంగా నిలుస్తున్న పాడి పశువులు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ వనదేవతలకు గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు బొడ్రాయి వద్ద పూజలు చేసి వనభోజనానికి గ్రామానిక తూర్పు దిశగా వెళ్లి కోటమైసమ్మ పోచమ్మ దేవాలయాలలో పూజలు చేశారు. అనంతరం వ్యవసాయ పొలాల్లోని చెట్ల కిందకు వెళ్లి అక్కడ వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. శ్రావణమాసంలో బోనాల పండుగ మరుసటిరోజు వన మహోత్సవం జరుపుకోవడం ఆనవాయితీ.


వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో ఆర్యవైశ్య సంఘం నాయకుల వనమహోత్సవం

## వీఆర్ఎలకు పేస్కేల్ అమలు చేయాలి

### - మండల అధ్యక్షుడు కె. రాములు


మాట్లాడుతున్న మండల వీఆర్ఎల సంఘం అధ్యక్షుడు

**చిన్నచింతకుంట, ఆగస్టు 23 ప్రభాతవార్త :** తెలంగాణ సీఎం కెసిఆర్ వీఆర్ఎలకు ఇచ్చిన హామీలను నెరవేర్చా లంటూ రాష్ట్ర వీఆర్ఏ జెఏసి పిలుపు మేరకు తహసిల్దార్ కార్యాల యం ఎదుట నిరవధి క సమ్మెను చేపట్టారు. మంగళ వారంతో వీఆర్ఎల సమ్మె 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీఆర్ఏ సంఘం మండల అధ్యక్షులు రాములు మాట్లాడుతూ వీఆర్ఎలకు పేస్కేల్ వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హత కలిగిన గ్రామ రెవెన్యూ సహాయకులకు ప్రభుత్వం వెంటనే ప్రమోషన్లను ఇవ్వాలని, 55 సంవత్సరాలు దాటిన వీఆర్ఎల వారసులకు ఉద్యోగాలు, పెన్షన్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె చేపడతామని తెలిపారు. ఈ సమ్మెలో వీఆర్ఏ సంఘం నాయకులు దేశన్న, మైనొద్దిన్, శ్యామ్, నాగరాజు, రవి, శ్రీనివాసులు, కృష్ణయ్య, ఆశన్న, వెంకటన్న, రాజేశ్వరి, బాలమణి, మణెమ్మ, భారతమ్మలు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి...

### - సర్పంచ్ బుజ్జి లక్ష్మణ్‌నాయక్


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

**వెల్దండ, ఆగస్టు 23, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కేస్లీతాండ నూతన గ్రామ పంచా యతీని అన్ని రంగా ల్లో అభివృద్ధి పరుస్తా నని బుజ్జి లక్ష్మణ్ నాయక్ పేర్కొన్నారు. కేస్లీతాండలో రూ.4లక్షలతో సీసీ రోడ్లు, రూ.2లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మంగళవారం ఉప సర్పంచ్ లక్ష్మణ్‌తో కలిసి సర్పంచ్ బుజ్జి లక్ష్మణ్‌నాయక్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నానని, భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకొచ్చి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో విజయడైరీ చైర్మన్ శ్రీనునాయక్, వార్డు సభ్యులు శ్రీను, లాల్‌సింగ్, గ్రామస్తులు మంత్రనాయక్, నరిసింగ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## సీపిఎస్ వినతిపత్రాల వారోత్సవం

### -సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సనాతన

**మహబూబ్‌నగర్ టౌన్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** 2004సెప్టెంబర్ ఒకటవ తేది నుంచి ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ చేస్తున్న పోరాటంలో భాగంగా ఆగస్టు 23 మంగళవారం సెప్టెంబర్ 1తేదీ వరకు జిల్లా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించే కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వా మి తెలిపారు. సీపీఎస్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వినతిపత్రాల సమర్పణలో ఎక్కడి వారు అక్కడే ఆయా ప్రాంతాలలో విధిగా పాల్గొనాలని ఆయన కోరారు.



## వీలైనంత త్వరలో ప్రతి ఇంటికి నల్ల

### - జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్


కాలనీ వాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

**జడ్చర్ల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** వీలైనంత త్వరలో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ ఇస్తామని జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ తెలిపారు. జడ్చర్ల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో కమిషనర్ మహమూద్ షేక్ మంగళవారం పర్యటించారు. మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్లను పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడుతూ నల్లా కనెక్షన్లు లేని ప్రతి ఇంటికి త్వరలోనే కనెక్షన్ కార్యక్రమాలు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రహీమ్, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు దోరేపల్లి రవిందర్, కృష్ణారెడ్డి, ముఖీద్, సాయి, కాంట్రాక్టర్లు, వార్డు సభ్యులు కమిషనర్ వెంట ఉన్నారు.

## మానవత్వాన్ని చాటుకొన్న దేవరకద్ర పోలీస్ హోంగార్డులు

**దేవరకద్ర రూరల్, ఆగస్టు 23:** దేవరకద్ర పోలీస్ హోంగార్డులు మంగళవారం తమ మానవత్వాన్ని చాటుకొన్నారు. అందరిచేత షభాష్ అనిపించుకొన్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మహబూబ్‌నగర్ మండలం అప్పాయపల్లికి చెందిన హోంగార్డు వెంకటయ్య అనారోగ్యం కారణంగా కొన్నేళ్ళక్రితం మృతి చేందారు. అయితే వెంకటయ్య కూతురు సింధూ తండ్రి లేకపోవడంతో ఆర్థిక పరిస్థితి బాగలేకపోవడంతో చదువు పై ఆసక్తి కనబర్చలేక పోయింది. బీదరికం కారణంగా వెంకటయ్య భార్య కూడ తన కూతురును చదివించలేని నిస్సాహయస్థితిలో ఉంది. ఈ విషయం తెలుసుకొన్న దేవరకద్ర పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే హోంగార్డులు ప్రవీణ్‌కుమార్, రాజులు సాటి ఉద్యోగి, స్నేహితుడు వెంకటయ్య కూతురు సింధూకు ఎలాగైన విద్య చెప్పించాలని నిర్ణయించుకొన్నారు. అందులో భాగంగానే సింధూను వారు దేవరకద్రలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. అంతేగాకుండా సింధూకు కావలసిని స్టేషనరీ వస్తువులను ఇప్పించడంతో పాటు ఖర్చులకు కూడ ఆర్థికసహాయం అందజేశారు. సాటి ఉద్యోగిపట్ల దేవరకద్రలో పనిచేసే హోంగార్డులు ప్రవీణ్‌కుమార్, రాజులు చూపించిన చొరవను అందరూ కొనియాడుతున్నారు. వారు చేసిన పనికి ప్రతిఒక్కరూ అభినందిస్తున్నారు. పోలీసులు ఉంటే ఇలా ఉండాలని అందరూ అంటున్నారు. మృతి చెందిన సాటి ఉద్యోగి కుటుంబాన్ని మానవతా దృక్పతంలో ఆదుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ సహాయం చేసినట్లు హోంగార్డులు ప్రవీణ్‌కుమార్, రాజులు తెలిపారు.


దేవరకద్రలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సింధూను చేర్పిస్తున్న హోంగార్డులు

## నేడు ఎర్రవల్లికి చేరుకున్న వైఎస్ షర్మిల పాదయాత్ర

**ఇటిక్యాల, ఆగస్టు 23 ప్రభాతవార్త :** ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ తెలంగాణ వైఎస్ఆర్ పార్టీ అధినేత వైఎస్ షర్మిల చేపట్టిన పాదయాత్ర మంగళవారం 130వ రోజు గద్వాలకు చేరుకుంది. 131వ రోజు బుధవారం జమ్మిచేడు నుండి మొదలై వీరాపురం, అనంతపురం స్టేజీ మీదుగా కేరళ మండలం 44వ నంబర్ జాతీయ రహదారి ఎర్రవల్లి చౌరస్తాకు సాయంత్రం 5 గం.లకు వైఎస్ షర్మిల పాదయాత్ర చేరుకుంటుందని పాదయాత్రకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ వైఎస్సార్ పార్టీ అలంపూర్ నియోజకవర్గ ఇంఛార్జి ప్రేమరాజు తెలిపారు.

**డాక్యుమెంట్స్ పోయినవి**

భూత్పూర్ పట్టణంలోని పంచవటి ఆసుపత్రి ఎదురుగా ఉన్న సర్వే నెం.64/డి, 72/బి 200 గజములు డాక్యుమెంట్ నెం.1480/2013 సంగనమోని వెంకటస్వామి కొన్న ప్లాటు నెం.30 లింక్ డాక్యుమెంట్స్ పోయినవి. లింక్ డాక్యుమెంట్ జిపిఎ తూము శ్రీకాంత్‌రెడ్డి పేర ఉంది. డాక్యుమెంట్స్ దొరికి వాటిని అప్పజెప్పిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును.

9392558643

**డాక్యుమెంట్స్ పోయినవి**

బాదేపల్లి - సిగ్నల్‌గడ్డ సమీపంలో కల్వకుర్తి రోడ్డు సర్వే నెం. 107/ఎ, ప్లాటు నెం.101, 200 గజములు కొన్న వారు ఎస్.భాస్కర్ అమ్మిన వారు బి.రవికిరణ్, వాస వెంకటరమణ పేర్ల మీద ఉన్న లింక్ డాక్యుమెంట్ పోయినవి. డాక్యుమెంట్ నెం.3963/2010, 6906/2015, 3156/2016 డాక్యుమెంట్స్ దొరికి వాటిని అప్పజెప్పిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును.

9392558643